
ఆంధ్రజ్యోతి

ANDHRAJYOTHY

5



విజయనగరం

జిల్లా వార్తలు

గురువారం 27 ఫిబ్రవరి 2025



పశుపతి నాథేశ్వరస్వామి దర్శనానికి భక్తుల బారులు

హరహర మహాదేవ

- శివనామంతో మార్మోగిన జిల్లా
- భక్తిశ్రద్ధలతో శివరాత్రి పూజలు

మహా శివరాత్రి పర్వదినాన్ని జిల్లా ప్రజలు భక్తిశ్రద్ధలతో జరుపుకున్నారు. ఉదయం నుంచి శివాలయాలకు భక్తులు పోటెత్తారు. హరహర మహాదేవ శంభో శంకర అంటూ నినదించారు. రుద్రాభిషేకాలు నిర్వహించారు. అన్ని ప్రాంతాల్లో ఆధ్యాత్మిక శోభ సంతరించుకుంది. ఉపవాస దీక్షలు ఆచరించారు. పుణ్యగిరి, రామతీర్థంలోని శివాలయాలు, ధర్మవరం సన్యాసేశ్వర ఆలయం, సారిపల్లిలోని దిబ్బేశ్వరస్వామి ఆలయం, విజయనగరం పశుపతినాథేశ్వర స్వామి, రామనారాయణం తదితర ఆలయాల్లో భక్తులు బారులు తీరారు. మెంటాడ మండలం జయతి గ్రామంలో పురాతన భ్రమరాంబిక మల్లికార్జున స్వామి ఆలయంలో మంత్రులు, కొండపల్లి శ్రీనివాస్, గుమ్మిడి సంధ్యారాణి ప్రత్యేక పూజలు నిర్వహించారు.



రామతీర్థంలో భక్తులతో కిటకిటలాడుతున్న శివరాత్రి జాతర ప్రాంగణం



పశుపతి నాథేశ్వరస్వామికి అభిషేకం

పులకించిన పుణ్యగిరి..

శృంగవరపుకోట, ఫిబ్రవరి 26 (ఆంధ్రజ్యోతి): శృంగవరపుకోట పుణ్య గిరికొండ బుధవారం శివనామస్మరణతో పులకించింది. మహాశివరాత్రి కావడంతో భక్తులు తెల్లవారుజాము నుంచే కొండపైకి క్యూ కట్టారు. 20వేల మంది వరకు భక్తులు ఉమాకోటి లింగేశ్వర స్వామిని దర్శించుకున్నారు. ప్రత్యేక పూజలు చేశారు. తొలుత దారగంగమ్మ లోయ, పుట్టదారల వద్ద పుణ్యస్నానాలు ఆచరించారు. దేవిబొమ్మ కూడలి నుంచి పుణ్యగిరి కొండ వరకు ఆర్టీసీ ప్రత్యేకంగా బస్సులను నడుపుతోంది.

రామతీర్థంలో ఘనంగా శివరాత్రి జాతర..

నెల్లిమర్ల, ఫిబ్రవరి 26(ఆంధ్రజ్యోతి): రామతీర్థం రామ, శివ నామ స్మరణలతో మార్మోగింది. శివరాత్రి పర్వదినాన్ని పురస్కరించుకుని జరిగిన జాతరకు విజయనగరం, శ్రీకాకుళం జిల్లాల నుంచి వేలాదిగా భక్తులు తరలివచ్చారు. బుధవారం ఉదయం నుంచే రామతీర్థం దేవ స్థానానికి భక్తులు పోటెత్తారు. రామకోనేరులో పుణ్యస్నానాలు చేసి సీతారాములను, ఉమా సదాశివ స్వామిని దర్శించుకుని మొక్కులు చెల్లించుకున్నారు. సాయంత్రానికి రామతీర్థం ప్రధాన వీధితో పాటు బోడికొండ పరిసరాలు, కళ్యాణ మండపం పరిసరాలు భక్తులతో కిక్కిరిసాయి. పూసపాటిరేగ, భోగాపురం, రణస్థలం మండలాలకు చెందిన మత్స్యకారులు రాత్రంతా ఒంటిపై (మిగతా 8వ పేజీలో..)



వంగర: సంగాంలో క్యూలో భక్తులు



గంట్యాడ: శివాలయంలో పూజలు చేస్తున్న మంత్రి శ్రీనివాస్

నేడు అత్యధికంగా పుణ్యగిరికి..

శృంగవరపుకోట, ఫిబ్రవరి 26 (ఆంధ్రజ్యోతి): మహాశివరాత్రికి పుణ్యగిరి ప్రత్యేకత వేరు. శివరాత్రి రోజున వచ్చిన భక్తులకంటే నాలుగు రెట్లు అధికంగా మరుసటి రోజు కొండపై కనిపిస్తారు. ఈ ఏడాది లక్ష ఐదు వేల మంది భక్తులు వస్తారని అధికారులు అంచనా వేశారు. బుధవారం 20వేల మంది వరకు వచ్చారు. జాగరాలు చేసిన భక్తులంతా అర్ధరాత్రి నుంచి గురువారం సాయంత్రం వరకు పుణ్యగిరి కొండపైకి వస్తూ ఉంటారు. ఉదయం 11 గంటల నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు మెట్ల దారిలో ఇసుక పోస్తే రాలనంతగా భక్తులు నడవాల్సి వస్తుంది. ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఓటింగ్ కేంద్రంను స్థానిక ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో ఏర్పాటు చేయడంతో ఇక్కడున్న క్రీడామైదానంలో పార్కింగ్‌కు అవకాశం లేకుండా పోయింది. దీంతో పోలీస్ శాఖ ప్రత్యామ్నాయ ఏర్పాట్లు చేసింది.

గంట్యాడలో పూజలు చేసిన మంత్రి..

గంట్యాడ, ఫిబ్రవరి 25 (ఆంధ్రజ్యోతి): గంట్యాడ శివాలయంలో మంత్రి కొండపల్లి శ్రీనివాస్ బుధవారం ప్రత్యేక పూజలు చేశారు. ఆయన వెంట టీడీపీ మండల అధ్యక్షుడు కొండపల్లి భాస్కర్ నాయుడు, నాయకులు జి.శ్రీనివాసరావు, సురేష్, వెంకటరావు, ఆర్.శ్రీనివాసరావు తదితరులు ఉన్నారు.



పోలింగ్ కేంద్రానికి సామగ్రితో బయలుదేరిన ఉద్యోగి

నేడే ఎమ్మెల్సీ ఎన్నిక

- ఉదయం 8 నుంచి సాయంత్రం 4 గంటల వరకూ పోలింగ్
- ఆరు జిల్లాల్లో 22,493 మంది ఓటర్లు
- పురుషులు 13,508, మహిళలు 8,985
- పోలింగ్ కేంద్రాలు 123
- పోలింగ్ సిబ్బంది 739 మంది
- 3న ఓట్ల లెక్కింపు

విశాఖపట్నం/ విజయనగరం, ఫిబ్రవరి 26(ఆంధ్రజ్యోతి): ఉత్తరాంధ్ర ఉపాధ్యాయ ఎమ్మెల్సీ స్థానానికి గురువారం పోలింగ్ జరగనుంది. ఉదయం ఎనిమిది గంటలకు ప్రారంభమై సాయంత్రం నాలుగు గంటలకు ముగియనుంది. అందుకు తగిన ఏర్పాట్లు అధికారులు పూర్తిచేశారు. ఈ ఎన్నికకు రిటర్నింగ్ అధికారిగా విశాఖ కలెక్టర్ ఎం.ఎన్.హరేంధిరప్రసాద్ వ్యవహరిస్తుండగా, శ్రీకాకుళం, పార్వతీపురం మన్యం, విజయనగరం, విశాఖపట్నం, అల్లూరి సీతారామరాజు, అనకాపల్లి జిల్లాల రెవెన్యూ అధికారులు అసిస్టెంట్ రిటర్నింగ్ అధికారులుగా ఉన్నారు.

ఆరు జిల్లాల పరిధిలో 22,493 మంది ఓటర్లు ఉన్నారు. వీరిలో పురుషులు 13,508 మంది, మహిళలు 8,985 మంది ఉన్నారు. పోలింగ్ కోసం ఆరు జిల్లాల పరిధిలో 123 కేంద్రాలు ఏర్పాటుచేశారు. ఎన్నికల నిర్వహణకు 739 మంది అధికారులను నియమించారు. వీరిలో 148 మంది పీవోలు, 148 మంది ఏపీవోలు, 295 మంది ఓపీవోలు ఉన్నారు. మరో 148 మంది మైక్రో అబ్జర్వర్లను నియమించారు. ఎన్నికల సిబ్బంది, మెటీరియల్‌ను బుధవారం సాయంత్రానికే కేంద్రాలకు తరలించారు. ఎన్నిక బ్యాలెట్ విధానంలో నిర్వహిస్తున్నారు. పోలింగ్ కేంద్రాల వద్ద పోలీస్ బందోబస్తు ఏర్పాటుచేశారు. కాగా ఈ ఎన్నికల్లో ఓటరు ప్రాధాన్యతా క్రమంలో ఓటు హక్కు వినియోగించుకోవచ్చు. ఉదాహరణకు ఒక అభ్యర్థికి మొదటి ప్రాధాన్య ఓటు వేస్తున్నట్టు అయితే పేరుకు ఎదురుగా ఉన్న గడిలో 'ఒకటి' అని నంబరు వేయాలి. అంతే తప్ప టిక్‌లు పెట్టరాదు. ఓటరుకు బ్యాలెట్ పేపరుతోపాటు స్కెచ్ పెన్ను ఇస్తారు. ఆ పెన్ మాత్రమే ఉపయోగించి ఓటువేయాలి తప్ప ఇతర పెన్నులు వాడరాదు.

పోటీలో ఉన్న అభ్యర్థులు...

సిట్టింగ్ ఎమ్మెల్సీ పాకలపాటి రఘువర్మ, కోరెడ్ల విజయగౌరి, గాదె శ్రీనివాసులనాయుడు, కోసూరు రాధాకృష్ణ, నూకల సూర్యప్రకాష్, రాయల సత్యనారాయణ, సత్తలూరి పద్మావతి, పెదపెంకి శివప్రసాద్, పోతల దుర్గాప్రసాద్, సుంకర శ్రీనివాసరావు (ఈయన పోటీ నుంచి తప్పుకుంటున్నట్టు వారం క్రితం ప్రకటించారు)

మూడో తేదీన ఓట్ల లెక్కింపు

ఎన్నికలలో కీలకమైన పోలింగ్ గురువారం సాయంత్రం నాలుగు గంటలతో ముగియనుంది. బ్యాలెట్ బాక్సులను సాయంత్రం ఆరు గంటల తరువాత ఆంధ్ర విశ్వవిద్యాలయం ఇంజనీరింగ్ కళాశాలలోని ఈఈఈ విభాగం బ్లాక్‌లో భద్రపరుస్తారు. జిల్లాల నుంచి గురువారం రాత్రికి బ్యాలెట్‌బాక్సులు వస్తాయి. వచ్చే నెల మూడో తేదీన ఓట్ల లెక్కింపు జరుగుతుంది. దీనికి సంబంధించి కౌంటింగ్ సిబ్బందికి రెండు రోజుల్లో శిక్షణ ఇవ్వనున్నారు.

ముగ్గురి మధ్య పోటీ

బరిలో పది మంది అభ్యర్థులు ఉండగా ముగ్గురి మధ్యే ప్రధాన పోటీ నెలకొంది. సుంకరి శ్రీనివాసరావు పోటీ నుంచి తప్పుకుంటున్నట్టు వారం క్రితం ప్రకటించారు. ఆయన రఘువర్మకు మద్దతు పలికారు. కాగా సిట్టింగ్ (మిగతా 8వ పేజీలో..)



ఎన్నికల ఏర్పాట్లను పరిశీలిస్తున్న ఆర్డీవో

తరుగుతున్న బియ్యం

- 50 కిలోల బస్తాలో 4 కిలోలు తగ్గుముఖం
- స్టాక్ పాయింట్ల వద్దకు చేరేసరికి తగ్గుతున్న వైనం
- ప్రయివేటు గోదాముల్లో గోల్‌మాల్
- జిల్లా వ్యాప్తంగా ఇదే పరిస్థితి

రాజాం, ఫిబ్రవరి 26(ఆంధ్రజ్యోతి): పౌర సరఫరాల శాఖ గోదాములకు వస్తున్న రేషన్ బియ్యంలో భారీగా తరుగు కనిపిస్తోంది. 50 కిలో బస్తాలో 5 నుంచి 6 కిలోలు తరుగు వస్తున్నట్టు సంబంధిత అధికారవర్గాలు చెబుతున్నాయి. ప్రధానంగా ప్రైవేటు గోదాముల నుంచి స్టాక్ పాయింట్లకు చేరుతున్న బియ్యంలోనే తరుగు భారీగా ఉంటోంది. దీంతో ఆ నష్టాన్ని స్టాక్ పాయింట్ అధికారులే భరించాల్సి వస్తోంది. రాజాం నియోజకవర్గానికి సంబంధించిన స్టాక్ పాయింట్లలో ఇలానే తరుగు రావడంతో సంబంధిత అధికారి తిప్పి పంపినట్టు సమాచారం. అయితే ఇది ఒక్క రాజాంలోనే కాదు. జిల్లా వ్యాప్తంగా ఇదే పరిస్థితి ఉన్నట్టు తెలుస్తోంది. తరుగు రూపంలోనే నెలకు రూ.1.50 కోట్ల వరకూ గోల్‌మాల్ జరుగుతున్నట్టు ఆరోపణలున్నాయి.

పేదల బియ్యాన్ని వదలని అక్రమార్కులు

దారిద్ర్యరేఖకు దిగువన ఉన్న వారి కోసం కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు రేషన్ అందిస్తూ వస్తున్నాయి. గతంలో రేషన్ ప్రక్రియలో భాగంగా బియ్యం, పంచదార, కందిపప్పు వంట నూనెతో పాటు నిత్యావసరాలను అందించేవారు కానీ వైసీపీ ప్రభుత్వం నిలిపివేసింది. ఉన్న బియ్యం కూడా సక్రమంగా అందించలేకపోయింది. ఇప్పుడు పేదలకు ఇస్తున్న బియ్యంలో కూడా భారీగా తరుగు కనిపిస్తోంది. జిల్లాలో 5.81 లక్షల మంది కార్డుదారులున్నారు. 9,159 టన్నుల బియ్యాన్ని ప్రభుత్వం జిల్లాకు కేటాయిస్తోంది. ఇందులో అంత్యోదయ అన్నయోజన కార్డులు 37,687 ఉన్నాయి. వీరికి 35 కిలోల చొప్పున ఉచితంగా బియ్యం అందిస్తున్నారు. వీరికి 1319.5 టన్నుల బియ్యం అందుతోంది. అయితే స్టాక్ పాయింట్లకు వచ్చేసరికి ఈ బియ్యం భారీగా తగ్గముఖం పడుతోంది. కొన్ని స్టాక్ పాయింట్ల వద్ద ఉన్న వ్యత్యాసాన్ని అక్కడి అధికారులే భరించుకుంటున్నారు.



రాజాం: తరుగు వచ్చిన బియ్యాన్ని తిరిగి గోదాములకు తరలిస్తున్న దృశ్యం

స్టాక్ పాయింట్ అధికారుల గగ్గోలు

సుదూర ప్రాంతాల నుంచి రైల్వే వ్యాగన్ల ద్వారా బియ్యం నిల్వలు చేరుతుంటాయి. అక్కడ నుంచి ప్రైవేటు గోదాముల్లో ఉంచడం.. ఆ తర్వాత పౌరసరఫరాల శాఖ గోదాములకు తరలించడం.. అక్కడి నుంచి నియోజకవర్గ కేంద్రాల్లో ఉండే స్టాక్ పాయింట్లకు తరలింపు జరుగుతుంటుంది. ఈ ప్రక్రియలో భాగంగా స్టాక్ పాయింట్ల వద్దకు వచ్చేసరికి బియ్యం బస్తాల్లో భారీగా తరుగు కనిపిస్తోంది. రేషన్ డీలర్లు తూకం వేసిన తరువాత బియ్యాన్ని డిపోలకు తరలిస్తుంటారు. కేజీ తగ్గినా డీలర్లు తిరిగి బియ్యాన్ని స్టాక్ పాయింట్‌లకు తరలిస్తుంటారు. అందులో వచ్చిన తరుగును స్టాక్‌పాయింట్ ఇన్‌చార్జీలు భరించాల్సి వస్తోందని తెలిసింది. దీనిపై ఎన్నిసార్లు ఉన్నతాధికారులకు ఫిర్యాదుచేసినా ఫలితం లేకపోతోందని స్టాక్ పాయింట్ అధికారులు వాపోతున్నారు. ఒక క్వింటా బియ్యం రవాణా ఖర్చులతో కలిపి రూ.4600 అవుతోంది. అంటే కిలో బియ్యం రూ.46 పలుకుతుందన్న మాట. ఒక్కో 50 కిలోల బియ్యం వద్ద నాలుగు కిలోల చొప్పున తరుగు వస్తోంది. అంటే రూ.184 పక్కదారి పడుతోందన్న మాట. గతంలో నెలలో ఐదుసార్లు రేషన్ బియ్యం తనిఖీ ప్రక్రియ ఉండేది. స్టాక్ పాయింట్ల నుంచి రేషన్ డిపోల వరకూ తహసీల్దార్లు, ఆర్డీవో స్థాయి అధికారులు తనిఖీ చేసేవారు. కానీ వైసీపీ ప్రభుత్వం వచ్చిన తరువాత తనిఖీ ప్రక్రియ నిలిచిపోయింది. దీంతో ఈ తరహా అక్రమాలు పెరిగిపోయాయి.

తనిఖీ చేస్తాం

జిల్లా వ్యాప్తంగా స్టాక్ పాయింట్లను తనిఖీ చేస్తాం. ఎక్కడైనా తరుగు కనిపిస్తే వెంటనే బియ్యాన్ని వెనక్కి పంపాలి. ఆ సమాచారాన్ని తెలియజేయాలి. ఆపై ఉన్నతాధికారులకు ఫిర్యాదుచేస్తాం. పేదల బియ్యం విషయంలో ప్రభుత్వం సీరియస్‌గా ఉంది. ఈ విషయంలో తప్పిదాలకు పాల్పడితే చర్యలు తప్పవు.

మీనాకుమారి, సివిల్‌సప్లయ్, డీఎమ్, విజయనగరం

'చీటి'ంగ్ కేసులో దంపతుల అరెస్టు

- 15 రోజుల రిమాండు విధించిన న్యాయస్థానం

భోగాపురం, ఫిబ్రవరి26(ఆంధ్రజ్యోతి): చీటింగ్ కేసులో భోగాపురం గ్రామం తోటవీధికి చెందిన భార్యాభర్త తిరుమరెడ్డి తులసీ, మురళీలను పోలీసులు అరెస్టు చేశారు. వారికి కోర్టు 15 రోజుల రిమాండ్ విధించింది. సీఐ ఎన్వీ ప్రభాకర్ బుధవారం ఆ వివరాలు తెలిపారు. భోగాపురం గ్రామం తోటవీధిలో నివాసముంటున్న తిరుమరెడ్డి మురళీ రూ.కోట్లలో చీటీలు నిర్వహిస్తూ కొద్దిరోజులుగా పరారీలో ఉన్నారు. చీటీ పూర్తయిన వారికి డబ్బులు చెల్లించకపోవడంతో పాటు స్థానికంగా అందుబాటులో లేకపోవడంతో ఆందోళన చెందిన బాధితులు గతేడాది డిసెంబరు 11న స్థానిక పోలీసులకు ఫిర్యాదు చేశారు. దీంతో దర్యాప్తు చేపట్టిన పోలీసులు పలు బృందాలుగా ఏర్పడి నిఘా పెట్టారు. ఈనెల 25న రాజమహేంద్రవరంలో నిందితులను అదుపులోకి తీసుకున్నారు. ఆపై అరెస్టు చేసి బుధవారం రిమాండ్‌కు పంపారు. వచ్చే నెల 12 వరకు వారికి కోర్టు రిమాండ్ విధించింది. వీరి బాధితులుగా 250 మంది వరకు ఉన్నట్లు సమాచారం. సుమారు రూ.30కోట్లకు పైగా చీటింగ్‌కు పాల్పడినట్లు చెబుతున్నారు. బాధితుల్లో ఇంటి పనులు చేసుకొనే కూలీల నుంచి ఉద్యోగుల వరకు అనేక మంది ఉన్నారు.



అరెస్టయిన తిరుమరెడ్డి తులసీ, మురళీ

జాతరలు ఐక్యతకు చిహ్నాలు

- మంత్రి కొండపల్లి శ్రీనివాస్

7లో

మనస్తాపంతో యువకుడి ఆత్మహత్య

నిఘా లేక.. నిత్యం రవాణా

- తాటిపూడి-కృష్ణాపురం మార్గంలో యథేచ్ఛగా కలప తరలింపు

8లో

వాతావరణ మార్పులతోనే విష జ్వరాలు: డీఎంహెచ్‌వో

- ఎస్.కోట ప్రాంతీయ ఆసుపత్రిలో చికిత్స తీరు పరిశీలన

7లో

సర్వం శివమయం

● శివాలయాల్లో భక్తుల బారులు



రాజాం రూరల్: రాజాంలోని కన్యకాంబ ఆలయంలో..

శివరాత్రి సందర్భంగా జిల్లా వ్యాప్తంగా ఉన్న శైవాలయాలకు భక్తులు పోటెత్తారు. వేకువజాము నుంచే స్వామి దర్శనానికి బారులు తీరారు. ఆలయాల్లో రుద్రాభిషేకాలు చేశారు. శివాలయాలను నిర్వాహకులు విద్యుద్దీపాలతో సుందరంగా అలంకరించారు. బుధవారం అర్ధరాత్రి లింగోద్భవ కాలంలో ప్రత్యేక పూజలు చేశారు. వివిధ ప్రాంతాల్లోని ఆలయాలను ప్రజాప్రతినిధులు, అధికారులు దర్శించుకున్నారు.

-ఆంధ్రజ్యోతి బృందం



విజయనగరం: పశుపతినాథేశ్వర ఆలయంలో భక్తుల రద్దీ



మెంటాడ: జయతి మల్లికార్జున స్వామి ఆలయంలో పూజలు చేస్తున్న మంత్రి సంధ్యారాణి



గజపతినగరం: మరుపల్లి శివాలయం వద్ద భక్తుల బారులు



శృంగవరపుకోట రూరల్: సన్యాసేశ్వరుని సన్నిధిలో ఎమ్మెల్యే కోళ్ల లలితకుమారి



జామి: జామి స్వర్ణాకర్ష రాజరాజేశ్వరి ఆలయంలో నందీశ్వరునికి పంచామృతాభిషేకం



పూసపాటిరేగ: కొవ్వాడలో మహారుద్రాభిషేకంలో పాల్గొన్న ఎమ్మెల్యే లోకం నాగమాధవి



గరివిడి: స్థానిక శివాలయంలో రుద్రాభిషేకాలు..



బొబ్బిలి శివాలయంలో భక్తులు



సంతకవిటి: వాల్తేరు మార్కండేశ్వర స్వామి ఆలయం వద్ద భక్తులు



రేగిడి: సంకిలి కాశీవిశ్వేశ్వర ఆలయంలో భక్తుల క్యూ..



తెర్లాం: నెమలాం శివాలయంలో పూజలు చేస్తున్న మహిళలు



బొబ్బిలి రూరల్: కలవరాయిలో శివలింగం ఆకారంలో సిద్ధం చేసిన కలశాలు



కొత్తవలస: ఓం సదనంలో అభిషేకంలో పాల్గొన్న భక్తులు

న్యూస్ బాక్స్

నేడు విద్యుత్ సరఫరాకు అంతరాయం

విజయనగరం రింగురోడ్డు, ఫిబ్రవరి 26 (ఆంధ్రజ్యోతి) ఫూల్‌బాగ్ సబ్‌స్టేషన్ పరిధిలోని 11కె.వి. ఫీడర్‌లో కండక్టర్ల మరమ్మతుల కారణంగా గురువారం ఉదయం 10 నుంచి సాయంత్రం 4 గంటల వరకు విద్యుత్ సరఫరాను నిలిపివేస్తున్నట్లు ఈఈ పి.త్రినాథ్‌రావు బుధవారం ఓ ప్రకటనలో తెలిపారు. లక్ష్మీగణపతి కాలనీ, సుబ్రహ్మణ్య స్వామి గుడి ఏరియ, జగదాంబ నగర్, గోల్డెన్ వ్యాలీ లే అవుట్ , ఫూల్‌బాగ్ కాలనీ మెయిన్ రోడ్డు, హాజీ అలీనగర్, మంగళవీధి కాలనీల్లో విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్లు తెలిపారు.

నీటి సరఫరా పునరుద్ధరణ

రేగిడి, ఫిబ్రవరి 26 (ఆంధ్రజ్యోతి): బొడ్డవలస పైలెట్ ప్రాజెక్టు ద్వారా రాజాం, రేగిడి మండలాల్లో 50 గ్రామాలకు నిలిచిపోయిన రక్షిత నీటి సరఫరా పునరుద్ధరణకు ఆర్‌డబ్ల్యూఎస్ యంత్రాంగం చర్యలు చేపట్టారు. మజ్జిరామునిపేట వద్ద మెయిన్ పైప్‌లైన్ లీక్ కావడంతో సరఫరా నిలిచిపోయిన సంగతి తెలిసిందే. దీనిపై ఈనెల 25న 'ఆంధ్రజ్యోతి'లో '50 గ్రామాలకు తాగునీటికి బ్రేక్' అనే శీర్షికన కథనం ప్రచురితమైంది. దీనిపై ఇక్కడి అధికారులకు ఉన్నతాధికారులు వివరణ కోరినట్లు సమాచారం. బుధవారం ఉదయం కొన్ని గ్రామాలకు అందించామని.. రాత్రికి నీటి సరఫరా పూర్తిగా పునరుద్ధరిస్తున్నట్లు ఏఈ శ్రీచరణ్ తెలిపారు.

సమగ్ర చట్టం అవసరం

రాజాం రూరల్, ఫిబ్రవరి 26 (ఆంధ్రజ్యోతి): అసంఘటిత రంగ కార్మికులకు రాష్ట్ర ప్రభుత్వం సమగ్ర చట్టం చేయాలని రాజాం బజార్ కలాసీ యూనియన్ గౌరవాధ్యక్షులు రామ్మూర్తినాయుడు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. కార్మికులతో బుధవారం ఆయన సమావేశమయ్యారు. ప్రభుత్వం అసంఘటిత రంగ కార్మికుల్ని కనీసం పట్టించుకోవడం లేదని ఆరోపించారు. వారి కోసం సమగ్ర చట్టం చేయాలని రామ్మూర్తినాయుడు విజ్ఞప్తి చేశారు.

కాకినాడ సమన్వయకర్తగా సురేష్‌బాబు

రాజాం రూరల్, ఫిబ్రవరి 26(ఆంధ్రజ్యోతి): జనసేన కాకినాడ సమన్వయకర్తగా ఆ పార్టీ రాజాం నియోజకవర్గ ఇన్‌చార్జి, రాష్ట్ర ప్రచార కమిటీ కార్యదర్శి పొగిరి సురేష్‌బాబును నియమిస్తూ అధినేత పవన్‌కల్యాణ్ ఉత్తర్వులు జారీ చేశారు. మార్చి 14న పిఠాపురంలో నిర్వహించనున్న జనసేన ఆవిర్భావ సభకు సంబంధించి మహిళలు, క్రియాశీల కార్యకర్తలు, జనసైనికులతో సమావేశాలు నిర్వహించనున్నారు.

ఆత్మను ఆరాధిస్తేనే మోక్షం

గంట్యాడ, ఫిబ్రవరి 26 (ఆంధ్రజ్యోతి): ఆత్మను ఆరాధిస్తే జీవుడు మోక్షం పొందుతాడని త్రైత సిద్ధాంత ప్రబోధ సేవా సమితి కమిటీ అధ్యక్షులు శంకరరావు అన్నారు. బుధవారం బుడతనాపల్లి, పెణసాం, చినమానాపురం గ్రామాల్లో త్రైత సిద్ధాంత భగవద్గీత ప్రచారకార్యక్రమం నిర్వహించారు.

జాతరలు ఐక్యతకు చిహ్నాలు: మంత్రి

బొండపల్లి, ఫిబ్రవరి 26 (ఆంధ్రజ్యోతి): పల్లెల్లో నిర్వహించే జాతరలు ఐక్యతకు చిహ్నంగా నిలుస్తాయని మంత్రి కొండపల్లి శ్రీనివాస్ అన్నారు. కొత్తపాలెం గ్రామంలో బుధవారం కృష్ణమ్మతల్లి పేరంటాలు మహోత్సవాలను ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన మంత్రి కొండపల్లి శ్రీనివాస్ మాట్లాడుతూ జాతరల్లో భాగంగా క్రీడా పోటీలు నిర్వహించడం వల్ల నైపుణ్యాలు వెలుగులోకి వస్తాయన్నారు. అనంతరం వివిధ పోటీల్లో విజేతలకు మంత్రి బహుమతులు అందజేశారు. జిల్లా స్థాయి వాలీబాల్, కబడ్డీ, ఎడ్లబండ్ల పోటీలు, గుర్రపు పందాలు నిర్వహించారు. గజపతినగరం సీఐ జీఏవీ రమణ, బొండపల్లి ఎస్ఐ యు.మహేష్, సిబ్బందితో బందోబస్తు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో మాజీ వైస్ ఎంపీపీ బొడ్డు రాము, గ్రామ సర్పంచ్ బొడ్డు సత్యవతి , గంట్యాడ మాజీ ఎంపీపీ కొండపల్లి కొండలరావు, బొండపల్లి, గంట్యాడ టీడీపీ అధ్యక్షులు కోరాడ కృష్ణ, కొండపల్లి భాస్కరరావు, నాయకులు అర్జునరావు, నంబూరి రాజేష్ తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న మంత్రి కొండపల్లి శ్రీనివాస్

వాతావరణ మార్పులతోనే విషజ్వరాలు: డీఎంహెచ్‌వో



పిల్లలను పరామర్శిస్తున్న డీఎంహెచ్‌ఓ జీవరాణి

శృంగవరపుకోట, ఫిబ్రవరి 26 (ఆంధ్రజ్యోతి): వాతావరణ మార్పులతోనే విషజ్వరాలు వ్యాపిస్తున్నాయని జిల్లా వైద్య ఆరోగ్య శాఖాధికారి డాక్టర్ జీవరాణి పేర్కొన్నారు. దారపర్తి గిరిజన పంచాయితీ పరిధిలోని వివిధ గ్రామాలకు చెందిన పిల్లలు జ్వరాల బారిన పడడంతో బుధవారం పత్రికల్లో వార్తలు వచ్చాయి. దీనికి స్పందించిన డీఎంహెచ్‌ఓ స్థానిక ప్రాంతీయ ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న 11 మంది పిల్లలను పరామర్శించారు. ఇవి దద్దుర్లుతో కూడిన సాధారణ జ్వరాలుగా గుర్తించారు. భయపడాల్సిన పనిలేదని బాధిత కుటుంబ సభ్యులకు ధైర్యం చెప్పారు. వీరికి అందుతున్న వైద్యం గురించి అడిగి తెలుసుకున్నారు. వైద్య పరీక్షలు చేసేందుకు ప్రత్యేక బృందాలను ఇంటింటికీ పంపించారు. ఆమె వెంట కొట్టాం వైద్యాధికారి బి.శిరీష తదితరులు ఉన్నారు.

కదిలిన వైద్య సిబ్బంది

శృంగవరపుకోట రూరల్, ఫిబ్రవరి 26 (ఆంధ్రజ్యోతి): దారపర్తి గిరిశిఖర గ్రామాల్లో విష జ్వరాలు వ్యాప్తి చెందాయని 'ఆంధ్రజ్యోతి'లో కథనం రావడంతో కలెక్టర్ అంబేడ్కర్ స్పందించారు. ఈ ఘటనపై పూర్తి స్థాయి నివేదిక ఇవ్వాలని జిల్లా వైద్యఆరోగ్యశాఖను ఆదేశించారు. దీంతో యంత్రాంగం ఒక్కసారిగా కదిలింది. బుధవారం ఉదయం నుంచి దారపర్తి గిరిజన పంచాయతీలో ఉన్న గ్రామాలకు వైద్యసిబ్బంది పరుగులు తీశారు. వైద్యాధికారి హారిక ఆధ్వర్యంలో వైద్య శిబిరాలు నిర్వహించి.. మందులు అందించారు. డీఐఓ అచ్యుత కుమారి శనగపాడు గ్రామానికి వెళ్లారు. గిరిశిఖర గ్రామాల్లో పది రోజులు పాటు వైద్య శిబిరాలు కొనసాగుతాయని డీఐవో తెలిపారు.



శనగపాడులో వైద్యశిబిరాన్ని పరిశీలిస్తున్న డీఐవో అచ్యుత కుమారి

ఎన్నికల నిర్వహణలో అప్రమత్తత అవసరం: జేసీ



అధికారులకు సూచనలిస్తున్న జేసీ సేతుమాధవన్

చీపురుపల్లి/గరివిడి, ఫిబ్రవరి 26 (ఆంధ్రజ్యోతి): ఎమ్మెల్సీ ఎన్నికలకు సంబంధించి అప్రమత్తంగా ఉండాలని జాయింట్ కలెక్టర్ సేతు మాధవన్ ఆదేశించారు. బుధవారం చీపురుపల్లి ఆర్డీవో కార్యాలయాన్ని ఆయన సందర్శించారు. ఎన్నికల నిర్వహణపై పోలీసు, రెవెన్యూ అధికారులకు సూచనలు, సలహాలు ఇచ్చారు. గరివిడి మండలంలో కొండపాలెం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలను, చీపురుపల్లి పట్టణంలో ఉన్న బాలుర హైస్కూల్‌ను అధికారులు ఇప్పటికే కేటాయించారు. గరివిడి మండలంలో 84 మంది, చీపురుపల్లిలో 123 మంది ఉపాధ్యాయులు ఓటుహక్కును వినియోగించుకోనున్నారు.

రఘువర్మ విజయానికి కృషి చేయండి: ఎమ్మెల్యే

రాజాం, ఫిబ్రవరి 26 (ఆంధ్రజ్యోతి): కూటమి ప్రభుత్వం బలపరిచిన ఎమ్మెల్సీ అభ్యర్థి పాకలపాటి రఘువర్మను గెలిపించడానికి మండల స్థాయి నాయకులు కృషి చేయాలని ఎమ్మెల్యే కోండ్రు మురళీమోహన్ కోరారు. బుధవారం పార్టీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ ఉపాధ్యాయుల సమస్యల కోసం నిరంతరం పోరాడే వ్యక్తి రఘువర్మను శాసనమండలికి పంపాలని కోరారు. గత ప్రభుత్వం ఉపాధ్యాయుల సమస్యలను గాలికి వదిలేసిందన్నారు. నేడు కూటమి ప్రభుత్వం ఉపాధ్యాయులకు ప్రతి నెల ఒకటో తేదీన జీతాలు అందించి, సమస్యల పరిష్కారానికి కృషి చేస్తోందన్నారు. అనంతరం కూటమి నాయకులతో కలిసి రాజాం ప్రధాన రహదారి పనులను పరిశీలించారు. ఈ కార్యక్రమంలో పట్టణ పార్టీ అధ్యక్షుడు నంది సూర్యప్రకాష్‌రావు, సుమల వెంకట మన్మథరావు, పిన్నింటి మోహన్‌రావు, గురవాన నారాయణరావు, అక్కుభుక్త కృష్ణమూర్తి, దుప్పలపూడి శ్రీనివాసరావు, బలిజిరెడ్డి శ్రీను, మద్దు మణి, నాగళ్ల అప్పలనాయుడు, రౌతు వెంకటరమణ జనసేన నాయకులు యు.పి.రాజు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే కోండ్రు మురళీమోహన్

పులి సంచరిస్తోందని..



జంతువు అడుగులను పరిశీలిస్తున్న అధికారులు

గరివిడి, ఫిబ్రవరి 26 (ఆంధ్రజ్యోతి): శివరాం గ్రామానికి అనుకొని ఉన్న పొలాల్లో బుధవారం వేకువజామున పులి పిల్లలు సంచరించాయని గ్రామస్థులు ఆందోళనకు గురయ్యారు. పొలం పనులు చేయడానికి వెళ్లిన రైతులు తమ పొలాల్లో పులి అడుగులు ఉన్నాయని చెప్పారు. సమాచారం అందుకున్న గరివిడి తహసీల్దార్ బంగార్రాజు విజయనగరంలో ఉన్న అటవీ శాఖ అధికారులకు సమాచారం ఇచ్చారు. రెవెన్యూ, అటవీ శాఖ అధికారులు వెంటనే శివరాం గ్రామంలో ఉన్న పొలాల వద్దకు వెళ్లారు. అవి పులి అడుగులు కావని, హైనా పిల్లలుగానీ, అడవి పిల్లి పిల్లలైనా కావచ్చని తేల్చారు. దీంతో రైతులు ఊపిరి పీల్చుకున్నారు.

క్రైం న్యూస్

మనస్తాపంతో యువకుడి ఆత్మహత్య



సోములు (ఫైల్)

బొబ్బిలి, ఫిబ్రవరి 26 (ఆంధ్రజ్యోతి): బొబ్బిలి పట్టణంలోని ఎరుకలివీధికి చెందిన గేదెల సోములు (29) మంగళవారం రాత్రి మనస్తాపంతో ఆత్మహత్యకు పాల్పడ్డాడు. ఎస్ఐ ఆర్.రమేష్ కథనం మేరకు.. టైల్స్ వర్కర్‌గా పనిచేస్తున్న సోములు అందరి దగ్గర మంచి వ్యక్తిగా పేరు సంపాదించుకున్నాడు. ఇటీవల ఆయనలో విపరీతమైన అసహనం, చిరాకు, కోపం పెరిగిపోయాయి. మంగళవారం కుటుంబసభ్యులు కలిసి శంబర పోలమాంబ మారు జాతరకు వెళ్లి అమ్మవారిని దర్శించుకొని తిరిగి ఇంటికి చేరుకున్నారు. దర్శన సమయంలో ఆలస్యం జరిగిందని భార్యాభర్తల మధ్య గొడవ ఇంటికి వచ్చే వరకూ జరిగింది. భార్య గంగమను తిట్టడమే కాకుండా తనలో తాను తిట్టుకుంటూ తీవ్ర అసహనానికి గురయ్యాడు.ఈ నేపథ్యంలో మంగళవారం రాత్రి కుటుంబసభ్యులు లేని సమయంలో ఇంట్లోని మొదటి గదిలోకి వెళ్లి ఫ్యాన్‌కు చీరతో ఉరిపోసుకున్నాడు. గమనించిన కుటుంబ సభ్యులు ఇరుగుపొరుగువారి సహాయంతో స్థానిక ప్రభుత్వాసుపత్రికి తరలించారు. అప్పటికే మృతి చెందినట్లు వైద్యులు నిర్ధారించారు. భార్య గంగమ్మ ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదుచేశారు. సోములుకు భార్య, ఇద్దరు పిల్లలు, తల్లి ఉన్నారు. మృతదేహానికి బుధవారం సీహెచ్‌సీలో పోస్టుమార్టం నిర్వహించి బంధువులకు అప్పగించారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ రమేష్ తెలిపారు.

మద్యం విక్రయిస్తున్న వ్యక్తి అరెస్ట్

విజయనగరం క్రైం, ఫిబ్రవరి 26(ఆంధ్రజ్యోతి): జిల్లా కేంద్రంలోని జొన్నగుడ్డి ప్రాంతంలో అక్రమంగా మద్యం విక్రయిస్తున్న ఎం.మోహన్‌రావును అదుపులోకి తీసుకుని 21 సీసాలు స్వాధీనం చేసుకున్నట్లు ఎన్‌ఫోర్స్ మెంట్ సి.ఐ. ఇందిరాదేవి ఓ ప్రకటనలో తెలిపారు. తదుపరి చర్యల నిమిత్తం వారిని విజయనగరం సర్కిల్ -1 టౌన్ స్టేషన్‌కు అప్పగించినట్లు తెలిపారు. ఈ దాడుల్లో ఎస్.ఐ. రాజశ్రీ , హెచ్‌సీ నాగేశ్వరరావు, ఈసీలు నాయుడు, భారతి పాల్గొన్నారు.

మాంసం విక్రేతలకు అపరాధ రుసుం

విజయనగరం రింగురోడ్డు, ఫిబ్రవరి 26 (ఆంధ్రజ్యోతి): మహాశివరాత్రి రోజున మాంసం విక్రయాలు చేపట్టిన దుకాణ యజమానులకు నగర పాలక సంస్థ కమిషనర్ పి.నల్లనయ్య అపరాధ రుసుం విధించి.. దుకాణాలను మూసివేయించారు. బుధవారం నగరంలో ఆయన పలు చోట్ల పర్యటించారు. కొంతమంది మాంసవిక్రయాలు కొనసాగించడంతో ఒక్కో షాపునకు రూ.3వేల వేల వంతున అపరాధ రుసుం విధించారు. కంటోన్మెంట్ ఎస్.బి.టి. మార్కెట్‌ను ఆక్రమించి ఏర్పాటు చేసిన దుకాణాలను అక్కడి నుంచి తరలించారు.

రెండుచోట్ల అగ్ని ప్రమాదాలు

వంగర, ఫిబ్రవరి 26 (ఆంధ్రజ్యోతి): వంగర, కింజంగి గ్రామాల్లో బుధవారం సంభవించిన అగ్ని ప్రమాదాల్లో గడ్డివాములు, ఒక ఇల్లు కాలి బూడిదయ్యాయి. వంగరలో సంభవించిన అగ్నిప్రమాదంలో రామినాయుడు, అసిరినాయుడు, కర్రి రాముకు చెందిన గడ్డివాములు బూడిదయ్యాయి. కింజంగిలో పంట గౌరమ్మకు చెందిన పెంకుటిల్లు అగ్నికి ఆహుతైంది. రాజాం అగ్నిమాపక సిబ్బంది మంటలు అదుపు చేశారు. విద్యుత్ షార్ట్ సర్క్యూట్ వల్ల ప్రమాదాలు సంభవించినట్టు భావిస్తున్నారు.

ఇరువర్గాల కొట్లాటపై కేసు నమోదు

సంతకవిటి, ఫిబ్రవరి 26 (ఆంధ్రజ్యోతి): ఇరువర్గాల కొట్లాటకు సంబంధించి మండవకురిటికి చెందిన కొప్పుశెట్టి కోటీశ్వరరావు, పలిశెట్టి సీతయ్యలు పరస్పరం ఫిర్యాదులు చేయడంతో ఐదుగురు వ్యక్తులపై కేసులు నమోదు చేశామని హెచ్‌సీ వంజరాపు జనార్దనరావు బుధవారం తెలిపారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం కోటీశ్వరరావు పొలంలో సర్వే మొక్కలను సీతయ్యకు చెందిన నాటుబండ్లు కుమ్మేయడంతో గొడవ జరిగింది. పలిశెట్టి సీతయ్య, లక్ష్మణరావు, గోవిందరావు తనపై దాడి చేశారని కోటీశ్వరరావు ఫిర్యాదు చేశారు. మరోవైపు కోటీశ్వరరావు, శ్రీనులు తమపై దాడి చేశారని పలిశెట్టి సీతయ్య కూడా పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఈమేరకు బుధవారం ఇరువర్గాలపై కేసులు నమోదు చేశామని హెచ్‌సీ వెల్లడించారు.



బొబ్బిలి: గొల్లపల్లి మునిసిపల్ హైస్కూల్‌లోని పోలింగ్ కేంద్రంలో అధికారులతో మాట్లాడుతున్న ఆర్డీవో రామ్మోహనరావు

పోలింగ్ నిర్వహణకు ఏర్పాట్లు

● కేంద్రాలకు చేరుకున్న ఎన్నికల సిబ్బంది

ఉత్తరాంధ్ర ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎన్నికల పోలింగ్ నిర్వహణకు అధికారులు ఏర్పాట్లు పూర్తిచేశారు. గురువారం జరిగే పోలింగ్‌కోసం సిబ్బంది కేంద్రాలకు బుధవారం చేరుకున్నారు.

● బొబ్బిలి, ఫిబ్రవరి 26 (ఆంధ్రజ్యోతి): బొబ్బిలిలోని గొల్లపల్లి శ్రీవేణుగోపాల మునిసిపల్ హైస్కూల్‌లో ఏర్పాటు చేసిన ఉపాధ్యాయ ఎమ్మెల్సీ పోలింగ్ కేంద్రాన్ని ఆర్డీవో జేవీఎస్ఎస్ రామ్మోహనరావు బుధవారం రాత్రి పరిశీలించారు. పోలింగ్‌బూత్‌లను, క్యూలైన్ బారికేడ్లను పరిశీలించి తహశీల్దారు మలపురెడ్డి శ్రీను, సీఐ కటకం సతీష్‌కుమార్, పోలింగ్ నిర్వహణా సిబ్బందితో మాట్లాడారు. పోలింగ్ కేంద్రానికి వందమీటర్ల వరకు ఎవరినీ అనుమతించేది లేదని ఆర్డీవో తెలిపారు. అభ్యర్థుల తరపున వారి ప్రతినిధులు ఏర్పాటు చేసుకునే టెంట్లు రెండు వందల మీటర్ల దూరంలో ఉండాలన్నారు. బీఎన్ఎస్ సెక్షన్ 163 అమలులో ఉంటుందన్నారు. బొబ్బిలి రెవిన్యూ డివిజన్ పరిధిలో బొబ్బిలి నియోజకవర్గానికి చెందిన బొబ్బిలి, రామభద్రపురం, బాడంగి, తెర్లాం మండలాలు, గజపతినగరం, దత్తిరాజేరు, మెంటాడ మండలాలు రెండు రూట్లు ఏర్పాటు చేశామన్నారు. పోలింగ్ ముగిసిన తరువాత బ్యాలెట్ బాక్స్‌లను బొబ్బిలి ఆర్డీవో కార్యాలయానికి తీసుకొచ్చిన తరువాత అన్నిబాక్స్‌లను ఒకేసారి విశాఖకు ఇక్కడ నుంచి తరలిస్తామని ఆర్డీఓ వివరించారు. ఎన్నికల పోలింగ్ సజావుగా నిర్వహించేందుకు అన్ని ఏర్పాట్లు పూర్తి చేసినట్లు తెలిపారు. పోలింగ్‌కోసం ఎన్నికల అధికారి,ఆర్డీవో రామ్మోహనరావు ఆధ్వర్యంలో వంద మంది సిబ్బందిని, పోలింగ్ సామగ్రిని ఆర్టీసీ బస్సుల్లో ఆయా పోలింగ్ కేంద్రాలకు తరలించారు. డివిజన్ పరిధిలోని ఏడు పోలింగ్ స్టేషన్ల పరిధిలో మొత్తం పురుష ఓటర్లు 759, స్త్రీలు 305 మంది ఉన్నట్లు ఆర్డీఓ తెలిపారు.

● రామభద్రపురం, ఫిబ్రవరి 26(ఆంధ్రజ్యోతి):రామభద్రపురంలో గురువారం జరగనున్న ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎన్నికల ఏర్పాట్లు పూర్తిచేసినట్టు ఎన్నికల ఆఫీసర్, జిల్లా పౌర సరఫరాల అధికారి మధుసూదన్ తెలిపారు. ఈ మేరకు పోలింగ్ స్టేషన్‌ను బుధవారం పరిశీలించారు. ఈ సందర్భంగా ఏర్పాట్లను తహసీల్దార్ ఆకుల సులోచనారాణిని అడిగి తెలుసుకున్నారు. ఎటువంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. బీఎన్ఎస్ఎస్ 163 ప్రకారం200 మీటర్ల దూరంగా ప్రజలు ఉండాలని, నలుగురైదుగురు గుమిగూడి ఉండరాదని తెలిపారు. పోలింగ్ స్టేషన్‌లో 82 మంది తమ ఓటుహక్కును వినియోగించుకోనున్నారు. ఈ సందర్భంగా సీసీ కెమెరాలు కూడా ఏర్పాటు చేశారు. పోలింగ్ సిబ్బంది పూర్తి సామగ్రితో పోలింగ్ కేంద్రానికి చేరుకున్నారు. ఎస్ఐ వెలమల ప్రసాద్ ఆధ్వర్యంలో గట్టి పోలీసు బందోబస్తు ఏర్పాటు చేశారు.



రామభద్రపురం: పోలింగ్ కేంద్రంలో సిబ్బందితో మాట్లాడుతున్న ఎన్నికల అధికారి మధుసూదన్

ఎన్నికల నిబంధనలు పాటించాలి: సీఐ

బాడంగి, ఫిబ్రవరి 26(ఆంధ్రజ్యోతి): ఉత్తరాంధ్ర టీచర్స్ ఎమ్మెల్సీ ఎన్నికల నేపథ్యంలో ఎన్నికల నిబంధనలను పోలీసు సిబ్బంది పాటించాలని బొబ్బిలి రూరల్ సీఐ నారాయణరావు తెలిపారు. బుధవారం బాడంగిలో విలేకరులతో మాట్లాడుతూ బొబ్బిలి సర్కిల్‌లో గల బాడంగి, తెర్లాం, రామభద్రపురం పోలింగ్‌స్టేషన్ల పరిధిలో 144 సెక్షన్ అమలులో ఉంటుందన్నారు. పోలింగ్ అధికారి అనుమతి లేకుండా బూత్‌లోకి పోలీసు సిబ్బంది ప్రవేశించరాదని తెలిపారు. ఎటువంటి గొడవలు జరిగినా వెంటనే అధికారులకు తెలియజేయాలని కోరారు. పోలీసు సిబ్బంది నిష్పక్షపాతంగా విధులు నిర్వహించాలని తెలిపారు.కేటాయించిన ప్రాంతాలను వదిలి వెళ్లవద్దని చెప్పారు. వంద మీటర్ల పరిధిలో మార్కు చేయించి ఓటర్లు తప్ప మరే ఇతర వాహనాలు అనుమతించరాదని తెలిపారు.

అవయవ దానానికి యువత అంగీకారం



అవయవ దానానికి అంగీకార పత్రాలు ఇస్తున్న యువకులు

గరివిడి, ఫిబ్రవరి 26 (ఆంధ్రజ్యోతి): వెదుళ్లవలస గ్రామానికి చెందిన యువత అవయవదానానికి అంగీకరిస్తూ సంతకాలు చేశారు. చీపురుపల్లికి చెందిన మానవీయత స్వచ్ఛంద సంస్థ వ్యవస్థాపకులు బీవీ గోవిందరాజులుకు అంగీకార పత్రాలను బుధవారం సాయంత్రం అందజేశారు. కొంతకాలంగా అవయవ దానంపై గోవిందరాజులు గ్రామాలలో అవగాహన కల్పిస్తున్నారు. దీనిపై స్పందించిన 120 మంది యువకులు అంగీకార పత్రాలను అందజేశారు. ఈ కార్యక్రమంలో గ్రామ పెద్దలు తలాడ సుబ్బలక్ష్మి, పెనుమత్స సాం బమూర్తిరాజు, గుడివాడ నారాయణరావు, పిల్లా నారాయణరావు, కోన పైడినాయుడు, బార్నాల సూరి అప్పలనాయుడు, శనపతి అప్పలనాయుడు, గుడివాడ శ్రీరామ్‌నాయుడు, జమ్మన తమ్మినాయుడు తదితరులు పాల్గొన్నారు.

ఎమ్మెల్సీ ఇందుకూరి పాదయాత్ర



ఎస్.కోటలో పాదయాత్రగా వెళ్తున్న ఎమ్మెల్సీ రఘురాజు

శృంగవరపుకోట రూరల్, ఫిబ్రవరి 26 (ఆంధ్రజ్యోతి): అందరూ ఆనందంగా ఉండాలని కోరుకుంటూ ఎమ్మెల్సీ ఇందుకూరి రఘురాజు బుధవారం పాదయాత్ర చేశారు. భర్తపురం శ్రీప్రసన్న వైభోగ వేంకటేశ్వర స్వామి ఆలయం నుంచి పుణ్యగిరి కొండపై ఉన్న ఉమా కోటి లింగేశ్వరస్వామి ఆలయం వరకు 9 కిలోమీటర్ల పాదయాత్ర చేశారు. వేంకటేశ్వరస్వామి ఆలయంలో ప్రత్యేక పూజలు చేశారు. ఆయన వెంట సతీమణి, రాష్ట్ర పర్యాటక శాఖ డెరెక్టర్ ఇందుకూరి సుధారాజు, వివిధ పంచాయతీల నాయకులు ఉన్నారు.

ఇంటర్ పరీక్ష కేంద్రాల్లో వసతులు కల్పించాలి

విజయనగరం దాసన్నపేట, ఫిబ్రవరి 26 (ఆంధ్రజ్యోతి): జిల్లాలో మార్చి 1 నుంచి జరగనున్న ఇంటర్ పరీక్ష కేంద్రాల్లో మౌలిక వసతులు కల్పించాలని జాతీయ మానవ హక్కుల పాలక సంస్థ రాష్ట్ర ప్రాధాన కార్యదర్శి పాండ్రంకి సంతోష్ కుమార్ కోరారు. ఆర్ఐ.ఓ.ఆదినారాయణకు వినతి పత్రం అందజేశారు. ఆయన వెంట సంస్థ ప్రతినిధులు అప్పారావు, మురళి తదితరులు ఉన్నారు.

నిఘా లేక.. నిత్యం తరలింపు

● తాటిపూడి-కృష్ణాపురం మార్గంలో యథేచ్ఛగా కలప రవాణా



తాటిపూడి-కృష్ణాపురం మార్గంలో ట్రాక్టర్‌లో కలప తరలిస్తున్న దృశ్యం

శృంగవరపుకోట రూరల్, ఫిబ్రవరి 26: మండలంలోని తాటిపూడి- కృష్ణాపురం రహదారిలో నిఘా లేకపోవడంతో పట్టపగలు నిత్యం కలప యథేచ్ఛగా తరలిస్తున్నారు. గతంలో ఎడ్ల బళ్లపై చాటు మాటుగా రవాణా చేసేవారు. ప్రస్తుతం ట్రాక్టర్లపై ఎటువంటి అనుమతిలేకుండా దర్జాగా తరలించడం విశేషం. ఎక్కువగా తాటిపూడి మీదుగా కృష్ణాపురం రహదారిలో తరలిస్తున్నా అటవీ, రెవెన్యూ అధికారులు చర్యలు తీసుకోవడంలేదన్న విమర్శలొస్తున్నాయి. గంటికొండ తదితర ప్రాంతాల నుంచి లక్షల రూపాయలు విలువచేసే టేకు తదితర రకాల కలపను ఎస్.కోట మండలంతోపాటు జామి, విజయనగరంలోని పలు సామిల్లులకు తరలిస్తున్నారు. మండ లంలోని సామిల్లులో కలప రిజిస్ట్రార్లు అధికారులు కనీసం తనిఖీలు చేయడంలేదన్న విమర్శలొస్తున్నాయి. అవి తనిఖీచేస్తే కలప అ క్రమ రవాణా వ్యవహారం వెలుగులోకి వచ్చే అవకాశముందని పలువురు చెబుతున్నారు. కాగా కలప రవాణాపై నిఘా ఏర్పాటుచేస్తామని అటవీశాఖ డీఆర్వో రవికుమార్ తెలిపారు. గంటికొండ నుంచి అక్రమంగా కలప తరలించే అవకాశంలేదని, అక్కడ కట్టుదిట్టమైన భద్రత ఉందని చెప్పారు.

నిర్వహణ లేక నిరుపయోగం

● అసాంఘిక కార్యకలాపాలకు అడ్డాగా మారిన ముక్కాంలోని బాలికల వసతిగృహం

భోగాపురం, ఫిబ్రవరి26(ఆంధ్రజ్యోతి): మండలంలోని ముక్కాంలో విద్యార్థులు లేక మూతపడిన బాలికల వసతిగృహం అసాంఘిక కార్యకలాపాలు అడ్డాగా మారింది. ప్రస్తుతం నిర్వ హణ లేకపోవడంతో నిరుపయోగంగా ఉంది. ఇక్కడ వెనుకబడిన తరగతుల బాలికల వసతి గృహ భవనాన్ని రూ.21.50లక్షల వ్యయంతో నిర్మించి 2010లో ప్రారంభించారు. అప్పటి నుంచి కొంత కాలం బాలికలు వసతిగృహంగా నిర్వహించారు. ఇక్కడ సరిపడ బాలికలు వసతిగృహంలో చేరక పోవడంతో తరువాత కొంత కాలం బాలుర వసతిగృహంగా నిర్వహించారు. అయితే బాలురు కూడా వసతి గృహంలో చేరకపోవడంతో దాన్ని కూడా పూర్తిగా మూసివేశారు. దీంతో నిరుప యోగంగా భవనాలు ఉండడంతో ప్రస్తుతం అసాంఘిక కార్యకలాపాలకు నిలయమయ్యింది. అధికారులు నిరుపయోగంగా ఉన్న భవనాన్ని వినియోగంలోకి తీసుకురావాలని స్థానికులు కోరుతున్నారు.



వినియోగంలో లేని బాలికల వసతిగృహం

మరమ్మతులు లేక.. తాగు నీరందక

● నిరుపయోగంగా మారిన ఆర్వో ప్లాంట్ ● పెంట జడ్పీ ఉన్నత పాఠశాల విద్యార్థుల అవస్థలు



నిరుపయోగంగా ఉన్న ఆర్వో ప్లాంట్

బొబ్బిలి రూరల్, ఫిబ్రవరి 26 (ఆంధ్రజ్యోతి):మండలంలోని పెంట జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో విద్యార్థుల తాగునీటి అవసరాలు తీర్చేందుకు ఏర్పాటుచేసిన ఆర్వోప్లాంట్ నుంచి సక్రమంగా నీరందడం లేదు. పాఠశాలలో 285 మంది విద్యార్థులు చదువుతున్నారు. విద్యార్థులకు శుద్ధజలాలను అందించేందుకు లక్షలాది రూపాయలు ఖర్చు చేసి ఆర్వో ప్లాంట్ ఏర్పాటుచేశారు. నిర్వహణ లోపం వల్ల నీరందకపోవడంతో మధ్యాహ్న భోజనం తర్వాత కొళాయి నీళ్లే బాటిళ్లలో పట్టుకొని విద్యార్థులుతాగాల్సివస్తోంది.ఆర్వో ప్లాంట్‌కు ఏర్పాటు చేసిన ప్లగ్ పెట్టిన తర్వాత కిందకి జారిపోతోంది.ఇక్కడ చిన్నపాటి మరమ్మతులు చేస్తే వినియోగంలోకి వచ్చే అవకాశముందని పలువురువిద్యార్థులు చెబుతున్నారు. కాగా విద్యుత్ సరఫరా ఉన్న సమయంలో ప్లాంట్ పనిచేస్తోందని హెచ్ఎం సీహెచ్‌రమణ తెలిపారు. విద్యార్థులు కొళాయిల వద్ద నీటిని బాటిళ్లతో సేకరించి దాహం తీర్చుకుంటు న్నారని చెప్పారు.

నీటి సదుపాయం లేక ఇక్కట్లు

పెంట ఎంపీపీ పాఠశాలలో ఏర్పాటు చేసిన వాషింగ్ పాయింట్ వద్ద నీటి సదుపాయం లేకపోవడంతో విద్యార్థులు మధ్యాహ్న భోజనం తర్వాత చేతులు, ప్లేట్లు కడుక్కునేందుకు అవస్థలకు పడుతున్నారు.చాలారోజులనుంచి నీరు రాకపోవడంతో పాఠశాల గేటువద్ద ఉన్న కొళాయి వద్ద కడుక్కోవలసి వస్తోందని పలువురు వాపోతున్నారు. త్వరలో మరమ్మతులు చేయిస్తామని హెచ్ఎం పద్మావతి తెలిపారు.



రామతీర్థం ఆలయం బయట భక్తుల కోలాహలం



ఎస్.కోట: పుణ్యగిరి ఆలయంలో పూజలు

హరహర మహాదేవ

(ఐదో పేజీ తరువాయి)

నూనె రాసుకుని మధ్యలో కాగడా పెట్టి నృత్యం చేశారు.

అఖండ జ్యోతిని వెలిగించిన ఎంపీ, ఎమ్మెల్యే

బోడికొండపై బుధవారం సాయంత్రం ఎంపీ కలిశెట్టి అప్పలనాయుడు, ఎమ్మెల్యే లోకం నాగమాధవి అఖండ జ్యోతిని వెలిగించారు. విజయనగరం ఎమ్మెల్యే అదితిగజపతిరాజు కూడా స్వామిని దర్శించుకున్నారు. ఈ తంతులో టీడీపీ సీనియర్ నాయకుడు సువ్వాడ రవిశేఖర్, మండల అధ్యక్షుడు కడగల ఆనంద్‌కుమార్, జిల్లా అధికార ప్రతినిధి గేదెల రాజారావు తదితరులు పాల్గొన్నారు.

సంగాంలో భక్తుల బారులు..

వంగర, ఫిబ్రవరి 26 (ఆంధ్రజ్యోతి): ప్రముఖ పుణ్యక్షేత్రం సంగాంలోని సంగమేశ్వరస్వామిని వేలాది మంది భక్తులు బుధవారం దర్శించుకున్నారు. వేకువజామునే వందలాదిమంది నాగావళి, వేగావతి, సువర్ణముఖి నదులు కలిసే త్రివేణి సంగమంలో స్నానాలు ఆచరించారు. ఇక్కడకు శ్రీకాకుళం, విశాఖ, విజయనగరంతో పాటు ఒడిశా నుంచి కూడా భక్తులు పోటెత్తారు. చీపురుపల్లి డీఎస్పీ రాఘవులు, సీఐ ఉపేంద్రరావు ఆధ్వర్యంలో వందలాదిమంది పోలీసులు బందోబస్తు విధులు నిర్వహించారు.



ప్రధాన ఆలయంలో ఎంపీ, ఎమ్మెల్యే



రామతీర్థంలో శివుని దర్శించుకుంటున్న ఎమ్మెల్యే నాగమాధవి దంపతులు

శతశాతం ఫలితాల సాధనే లక్ష్యం

వంగర, ఫిబ్రవరి 26 (ఆంధ్రజ్యోతి): విజయనగరం, పార్వతీపురం జిల్లాల్లోని గురుకుల పాఠశాలల్లో పబ్లిక్ పరీక్షలలో శతశాతం ఫలితాల సాధనే ధ్యేయంగా ప్రణాళికలు తయారు చేశామని ఉమ్మడి జిల్లా గురుకుల పాఠశాలల కోఆర్డినేటర్ రూపవతి తెలిపారు. మడ్డువలస గురుకుల పాఠశాలను బుధవారం ఆమె ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఉపాధ్యాయులతో మాట్లాడుతూ వెనుకబడిన విద్యార్థులను దత్తత తీసుకుని ప్రత్యేక తరగతులు నిర్వహించాలన్నారు. అనంతరం వసతి గృహంలోని వాటర్ ప్లాంట్, భోజన శాలను పరిశీలించారు. విద్యార్థులతో సహపంక్తి భోజనం చేశారు. అనంతరం విలేకరులతో మాట్లాడారు. రెండు జిల్లాల్లోని గురుకులాల్లో విద్యార్థుల సామర్థ్యం గుర్తించటానికి రోజువారీ పరీక్షలు నిర్వహించి... ప్రత్యేక మెటీరియల్ అందించామన్నారు. ఆమె వెంట ప్రిన్సిపాల్స్ శ్రీనివాస రావు, పద్మజ, సూర్యకుమారి తదితరులు ఉన్నారు. అనంతరం ఆమె ఉంగరాడమెట్ట అంబేడ్కర్ గురుకుల కళాశాలను తనిఖీ చేశారు.

● రేగిడి, ఫిబ్రవ 26, (ఆంధ్రజ్యోతి): పది, ఇంటర్‌లో శతశాతం ఉత్తీర్ణత లక్ష్యం కావాలని సమగ్రశిక్ష అడిషనల్ ప్రాజెక్టు అధికారి ఎ.రామారావు సిబ్బందికి దిశానిర్దేశం చేశారు. దేవుదళ కేజీబీవీ కళాశాలను బుధవారం ఆయన తనిఖీ చేశారు. ప్రిన్సిపాల్ ఎం. లక్ష్మి, సిబ్బందితో సమీక్షిం చారు. పది, ఇంటర్ తరగతులకు నేరుగా వెళ్లి విద్యార్థులతో ముచ్చటించారు.

సిబ్బంది కృషి అవసరం

వంగర, ఫిబ్రవరి 26 (ఆంధ్రజ్యోతి): కస్తూర్బా విద్యాలయంలో పబ్లిక్ పరీక్షల్లో మంచి ఫలితాల సాధనకు సిబ్బంది కృషి చేయాలని సర్వశిక్షా అభియాన్ అడిషనల్ ప్రాజెక్టు కోఆర్డినేటర్ రామారావు చెప్పారు. వంగర కేజీబీవీని తనిఖీ చేశారు. కార్యక్రమంలో ప్రత్యేక అధికారి రోహిణి తదితరులు పాల్గొన్నారు. అనంతరం విద్యార్థులతో సహపంక్తి భోజనం చేశారు.

నేడు ఎమ్మెల్సీ ఎన్నిక

(ఐదో పేజీ తరువాయి)

ఎమ్మెల్సీ పాకలపాటి రఘువర్మకు కొన్ని ఉపాధ్యాయ సంఘాలతోపాటు టీడీపీ, జనసేన మద్దతు ప్రకటించాయి. మరో అభ్యర్థి గాదె శ్రీనివాసులనాయుడుకు కొన్ని ఉపాధ్యాయ సంఘాలు మద్దతు తెలిపాయి. అదేవిధంగా కూటమి భాగస్వామి అయిన బీజేపీకి చెందిన కొందరు నాయకులు సంఘీభావం ప్రకటించారు. కోరెడ్ల విజయగౌరికి వామపక్షాలకు అనుబంధంగా ఉండే ఉపాధ్యాయ సంఘాలు మద్దతు తెలిపాయి. సాంకేతికంగా బ్యాలెట్‌లో 10 మంది పేర్లుఉండగా...వారిలో ఒకరు తప్పుకున్నారు.మిగిలిన తొమ్మిదిమందిలో ప్రధానంగా పాకలపాటి రఘువర్మ,గాదె శ్రీనివాసులనాయుడు, కోరెడ్ల విజయగౌరి మధ్యే పోటీ ఉంది.

విజయనగరం జిల్లాలో 29 కేంద్రాలు

విజయనగరం ఉమ్మడి జిల్లాలో 7,555 మంది ఓటర్లుగా నమోదయ్యారు. విజయనగరంలో 5,223, పార్వతీపురం మన్యంలో 2332 మంది ఉన్నారు. 29 పోలింగ్ కేంద్రాలను ఏర్పాటుచేశారు. ఒక్క విజయనగరం జిల్లా కేంద్రంలోనే 2166 మంది ఓటర్లు ఉండడంతో వారికోసం మహరాజా ప్రభుత్వ సంగీత నృత్య కళాశాలలో 3 పోలింగ్ కేంద్రాలను ఏర్పాటుచేశారు. ఓటర్లు ప్రభుత్వం నిర్దేశించిన 11 గుర్తింపుకార్డుల్లో ఏదో ఒకటి తీసుకొస్తే సరిపోతుంది. ఏర్పాట్లను జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ అంబేడ్కర్ పర్యవేక్షిస్తున్నారు. ఎన్నికలు సజావుగా పూర్తయ్యేందుకు అందరూ సహకరించాలని కలెక్టర్ కోరారు.

ఒక్కో పోలింగ్ కేంద్రానికి ఒక పీఓ (ప్రిసైడింగ్ ఆఫీసర్), ఏపీఓ, ఇద్దరు అదనపు పోలింగ్ అధికారులు, ఒక సూక్ష్మ పరిశీలకులను నియమించారు. విజయనగరం, బొబ్బిలి, చీపురుపల్లి ఆర్‌డీఓ కార్యాలయాల వద్ద డిస్ట్రిబ్యూషన్ సెంటర్, రిసెప్షన్ సెంటర్లను ఏర్పాటు చేశారు. విజయనగరం డివిజన్లో 4 రూట్లు, చీపురుపల్లి, బొబ్బిలి డివిజన్లో రెండేసి రూట్లను ఏర్పాటు చేశారు. ఒక్కో రూట్ పర్యవేక్షణకు ఒక రూట్ ఆఫీసర్, ఒక సెక్టార్ ఆఫీసర్‌ను నియమించారు. ఆర్‌డీఓ కార్యాలయాల వద్ద పోలింగ్ సిబ్బందికి బుధవారం ఉదయమే ఎన్నికల సామగ్రిని అందజేశారు. మొత్తం 8 బస్సుల ద్వారా ఆయా పోలింగ్ కేంద్రాలకు సిబ్బంది తరలివెళ్లారు. ఈ ప్రక్రియను ఎంఎల్‌సి ఎన్నికలకు ఏఆర్‌ఓగా వ్యవహరిస్తున్న జిల్లా రెవెన్యూ అధికారి ఎస్.శ్రీనివాసమూర్తి, ఆయా డివిజన్ల ఆర్‌డీఓలు పర్యవేక్షించారు. జాయింట్ కలెక్టర్ ఎస్ సేతుమాధవన్ చీపురుపల్లిలో పర్యటించారు. ఆర్‌డీఓ కార్యాలయం వద్ద ఏర్పాటు చేసిన డిస్ట్రిబ్యూషన్ సెంటర్‌ను, ఎన్నికల ఏర్పాట్లను పరిశీలించారు.

పటిష్ఠ బందోబస్తు..

విజయనగరం క్రైం, ఫిబ్రవరి 26(ఆంధ్రజ్యోతి): ఎమ్మెల్సీ ఎన్నికలకు పటిష్ఠ బందోబస్తు ఏర్పాట్లు చేసినట్లు ఎస్పీ వకుల్‌జిందాల్ తెలిపారు. 29పోలింగ్ కేంద్రాల వద్ద సుమారు 500 మందితో భద్రతా ఏర్పాట్లు చేసినట్లు తెలిపారు. పోలింగ్ కేంద్రానికి 200 మీటర్ల పరిధిలో రాజకీయ పార్టీలు, మద్దతు దారులు ఎటువంటి టెంట్‌లు, స్టాల్స్ ఏర్పాటు చేయకుండా పోలీస్ అధికారులు చర్యలు చేపట్టాలన్నారు. ఓటుహక్కు వినియోగించుకోవడానికి వచ్చే ఓటర్లు ఎటువంటి ప్రలోభాలకు లొంగకుండా, ఓటు హక్కును స్వేచ్ఛగా వినియోగించుకునేలా చర్యలు చేపట్టాలన్నారు.



పోలింగ్ కేంద్రం వద్ద మార్కింగ్ చేయిస్తున్న విజయనగరం సీఐ శ్రీనివాస్

100 రోజుల పనుల్లో ప్రగతి సాధించాలి

రాజాం, ఫిబ్రవరి 26 (ఆంధ్రజ్యోతి): కూలీలకు 100 రోజులు పని కల్పించడంలో ప్రగతి సాధించాలని ఎంపీడీఓ వి.శ్రీనివాసరావు, ఏపీడీ ఎం.శ్రీనివాసరావులు ఆదేశించారు. బుధవారం మండల పరిషత్ కార్యాలయంలో టెక్నికల్ అసిస్టెంట్లతో సమీక్షించారు. కార్యక్రమంలో ఏపీఓ కె.సాయిరాం పాల్గొన్నారు.

రేపటి నుంచి దుర్గమ్మ విగ్రహ ప్రతిష్ఠ

కొత్తవలస, ఫిబ్రవరి 26 (ఆంధ్రజ్యోతి):తోటలో దుర్గమ్మ పేరుతో వెలసిన కనకదుర్గ అమ్మవారి విగ్రహ ప్రతిష్ఠాకార్యక్రమాన్ని శుక్రవారం నుంచి మార్చి 2వతేదీ వరకు నిర్వహిస్తున్నట్టు ఆలయ వ్యవ స్థాపకుడు ఏడువాక వెంకట రమణ తెలిపారు. ఆలయ పునః ప్రతిష్ఠోత్సవాలలో భాగంగా నూతన విగ్రహాలను సిద్ధం చేశారు.